సాక్షి శ్రీకాకుళం

శనివారం । 13 । మే । 2023



ప్రతి పొరుడూ పోలీసే..

కొత్తూరులో నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని స్పీకర్ తమ్మినేని ప్రారంభించారు. ప్రతి పౌరుడూ పోలీసేనన్నారు. -IIలో



పాఠ్య పుస్తకాలు వచ్చేశాయి

కొత్త పాఠ్య పుస్తకాలు వచ్చేశాయి. తొలి విడత పుస్తకాలను మండల కేంద్రాల్లో భద్రపరిచారు. -IIలో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	38°	26°
ఇచ్ఛాపురం	38°	26°
పాతపట్నం	38°	25°
శ్రీకాకుళం	37°	25°

న్యూస్‌రీల్

15న నీలమణి దుర్గ ఆలయ హుండీ లెక్కింపు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం హుండీ కానుకల ఆదాయాన్ని ఈ నెల 15న సోమవారం ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్, ఈఓ నూలు ఈశ్వరరావు, టి.వాసుదేవరావులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది సమక్షంలో లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్



జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం శనివారం జిల్లాలో జిల్లా కోర్టుతో పాటు, ఇతర న్యాయస్థానాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారికి ఉన్న రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, అన్నింటినీ రాజీమార్గం ద్వారా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ అయిన కేసులకు అప్పీల్ చేసే అవకాశం లేదని, సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు.

డీఎస్‌ఏ చీఫ్ కోచ్‌గా శ్రీధర్‌రావు నియామకం



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.శ్రీధర్‌రావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్‌గా జిల్లాకు చెందిన డాక్టర్ కళ్లేపల్లి శ్రీధర్‌రావు నియామకమయ్యారు. ఈ మేరకు శాప్ ఎండీ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈయన విజయవాడ శాప్ స్పోర్ట్స్ ఆఫీసర్ నుంచి శ్రీకాకుళం చీఫ్ కోచ్‌గా బదిలీపై వచ్చారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కోచ్‌లు, కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. అంతకుముందు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి అథ్లెటిక్స్ కోచ్‌గా గుర్తింపు పొందిన శ్రీధర్ గతంలో జిల్లా డీఎస్‌డీఓగా, చీఫ్ కోచ్‌గా పని చేసి మెప్పించారు.

ఖాదీలో యువతకు శిక్షణ



నేత ప్రక్రియను పరిశీలిస్తున్న హస్తకర్ ఫ్యాషన్ డిజైనర్ శోభ

పొందూరు: ఖాదీ పరిశ్రమ శాశ్వతంగా మనుగడ సాగించేందుకు ఖాదీ గ్రామోద్యోగ కమిషన్ సౌజన్యంతో అవసరమైన శిక్షణ ఇప్పించాలని హస్తకర్ ఫ్యాషన్ డిజైనర్ సీహెచ్ శోభ(విశాఖ)కోరారు. ఆమె శుక్రవారం స్థానిక ఖాదీ పరిశ్రమను పరిశీలించారు. ఖాదీ వారసత్వాన్ని కొనసాగిస్తూనే ఆధునిక పోకడలను మిళితం చేయాలని కోరారు. సమకాలీన వస్త్రప్రియుల అభిరుచులకు అనుగుణంగా సరికొత్త డిజైన్లను రూపొందిస్తే పరిశ్రమ మరింత ప్రగతి సాధిస్తుందని పేర్కొన్నారు. ఖాదీ, నేత ప్రక్రియలను, అంబర్, ఎన్‌ఎమ్‌సీ చరఖాలను పరిశీలించి కార్మికులకు అవసరమైన సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఖాదీ సంస్థ అధ్యక్షుడు జీకే ప్రసాద్, విశాఖ ఆరోహణ్ గిరిజన సొసైటీ అధ్యక్షురాలు సురేఖా పట్నాయక్, సహవ్యవస్థాపకులు యుపీ పట్నాయక్ పాల్గొన్నారు.

21లోపే ఈ-ప్రగతి సేవలు

శ్రీకాకుళం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 21వ తేదీలోపే ఈ ప్రగతి సేవలు పనిచేస్తాయని జిల్లా రవాణా ఇన్‌చార్జి కమిషనర్ డీసీ రాజరత్నం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రగతి సర్వీసులకు సంబంధించి ఈ నెల 20వ తేదీలోగా డ్రైవింగ్ లైసెన్సులు, ఇతరత్రా కార్యకలాపాలు ఉంటే సాధ్యమైనంత త్వరలో వాటిని నిర్వహించుకోవాలని సూచించారు. ఈ నెల 26వ తేదీ నుంచి సారథి నిక్ సర్వీసుల ద్వారా అన్ని ఆర్టీఏ పనులు, డ్రైవింగ్ లైసెన్సు కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చునని వారు తెలిపారు.

కొండ గుండెలవిసిపోయెను

వనం దాటిన నాలుగు గజరాజుల ఆయుష్షు అడవి బయటే తీరిపోయింది. ఇన్నేళ్లుగా గ్రామగ్రామాన ఘీంకారాలు చేస్తూ విధ్వంస రచన సాగించినా వాటి చావును ఏనాడూ గిరిజనం కోరుకోలేదు. పంటలు నాశనమైనప్పుడు, మనుషులను కోల్పోయినప్పుడు ఏనుగులు మళ్లీ అడవిలోకి వెళ్లిపోతే బాగుండుననే అంతా కాంక్షించారు. కానీ భామిని మండలంలో నాలుగు ఏనుగులు విద్యుత్‌షాక్‌తో చనిపోయాయి. ఈ వార్త విని కొండ గుండెలవిసిపోయాయి. కొన్ని గ్రామాలకు ఏనుగుల బారి నుంచి ఉపశమనం లభించినా.. వాటి మరణం మాత్రం విషాదమే మిగిల్చింది.



- భామిని మండలంలో విద్యుత్ షాక్‌తో నాలుగు ఏనుగులు మృతి
- ఏళ్లకు ఏళ్లు గిరిజన గ్రామాల్లో విధ్వంసం సృష్టించిన గజరాజులు
- 13 మందిని పొట్టన పెట్టుకున్న వైనం
- అడవుల్లోకి వెళ్లిపోతాయనుకుంటే ఇలా విషాదాంతం
- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఇంకా 14 ఏనుగుల సంచారం



ఘటనా స్థలిలో ఏనుగుల కళేబరాలు, కన్నీరు పెడుతున్న గిరిజన మహిళలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : నాలుగు ఏనుగులు చనిపోయాయి. ఇన్నాళ్లూ ఇబ్బంది పెట్టిన గజరాజులు విద్యుత్‌షాక్ తగిలి ప్రాణాలు కోల్పోయాయి. ఈ ఘటనపై గిరిజన గ్రామాలు బాధను అనుభవిస్తూనే కాస్త ఉపశమనాన్నీ పొందాయి. ఉమ్మడి జిల్లాలోని అటవీ ప్రాంతంలోనికి సుమారు 15 ఏళ్ల క్రితం ఏనుగుల గుంపు ప్రవేశించింది. అప్పటి నుంచి విధ్వంస రచన కొనసాగుతూనే ఉంది. ఆ ఏనుగులు ఇప్పటివరకు 13 మందిని పొట్టన పెట్టుకోగా, ఆ గుంపులోని 13 ఏనుగులు ఇప్పటివరకు వేర్వేరు కారణాలతో మృతి చెందాయి. ఈ నేపథ్యంలో వాటి చావును కోరుకోకపోయినా.. జనాల మధ్య రాకుండా ఉంటే మంచిదనే పరిస్థితుల్లో ప్రజలు గడిపారు.

ఒడిశా నుంచే వచ్చిన ఏనుగులు

2007 మార్చిలో ఒడిశా లఖేరీ అడవుల నుంచి 12 ఏనుగుల గుంపు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సరిహద్దులో ప్రవేశించాయి. అందులో ఒకటి మార్గమధ్యలో చనిపోవడంతో జిల్లాకొచ్చిన ఏనుగుల సంఖ్య 11కు పరిమితమైంది. రెండో విడతగా మరో ఎనిమిది ఏనుగులు జిల్లాలోకి వచ్చాయి. మూడో విడతగా మరో ఆరు ఏనుగులు జిల్లాలోకి ప్రవేశించాయి. ఈ ఏనుగులు ఉమ్మడి జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, సీతంపేట, వీరఘట్టం, హిరమండలం, భామిని, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో ఎక్కువగా సంచరించాయి. సంచరిస్తూనే ఉన్నాయి. అయితే దట్టమైన అడవుల్లో ఉండాల్సిన ఏనుగులు గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయి. ఒక్కొక్క ఏనుగు రోజుకు సుమారు 350కిలోల ఆహారం, 200 లీటర్ల నీటిని తీసుకుంటున్నట్టు అధికార వర్గాల లెక్కల చెబుతున్నాయి. ఆకులు, కొమ్మల కంటే ధాన్యం, బియ్యం, ఇతరత్రా పంటలు తినేందుకు ఎక్కువగా ఇష్టపడుతుండటంతో మైదానంలోకి తప్పని పరిస్థితుల్లో వచ్చేస్తున్నాయి.

నష్టాలివే..

ఏనుగుల దాడి కారణంగా కొండ పోడులో సాగు చేసుకుంటున్న అరటి, జీడి, మామిడి తోటలతో పాటు వరి, కంది, పసుపు వంటి పంటలను కాళ్లతో తొక్కేసి నాశనం చేస్తున్నాయి. గ్రామాల్లోకి వెళ్లి పూరిళ్లను పీకేసి గిరిజనులు దాచుకున్న తిండిగింజలను తినేస్తున్నాయి. కె.వీరఘట్టం, హుస్సేన్ ఉరం, సంత నర్సీపురం, చలివేంద్రి, పాడలి, సోధ, పొన్నుటూ రు, హీరాపురం, పరశురామపురం, పెద్దమంద, ఈతమానుగూడ, భామిని మండలానికి చెందిన 13మందిని బలి తీసుకున్నాయి.

ఇప్పటికి 13 ఏనుగులు మృతి..

ఇప్పటివరకు ఎంత మంది ఏనుగుల కారణంగా చనిపోయారో అదే సంఖ్యలో గజరాజులు కూడా మృతిచెందాయి. మొదటగా వచ్చిన 11 ఏనుగుల్లో ఏడు మృతి చెందాయి. అటు ఇటు తరలిస్తుండగా రెండు మృతి చెందగా, కొమరాడ మండలం అర్తాం వద్ద విద్యుత్ షాక్‌తో ఒకటి, తోటపల్లి ప్రాజెక్ట్ సమీపంలో నాగావళి నదిలో పడి మరో ఏనుగు మృతి చెందింది. వీరఘట్టం మండలం కుంబిడి ఇచ్ఛాపురం వద్ద కొంతమంది రెండు ఏనుగులను హతమార్చారు. అనంతరం ఎస్.గోపాలపురం వద్ద విద్యుత్ షాక్ తగిలి మరో ఏనుగు మృతి చెందింది. వాటిలో ప్రస్తుతం నాలుగు ఏనుగులు మాత్రమే జిల్లాలో ఉన్నాయి. ఇవి కాకుండా మరో విడతలో ఎనిమిది జిల్లాలోకి వచ్చాయి. వాటిలో రెండు చనిపోగా, రెండు పిల్లలు పుట్టాయి. దీంతో రెండో విడతగా వచ్చిన ఏనుగుల సంఖ్య ఎనిమిదిగానే నిలిచింది. ఇప్పుడివి కొమరాడ ప్రాంతంలో ఉన్నాయి. ఇక మూడో విడతగా ఫిబ్రవరిలో మరో ఆరు ఏనుగులు జిల్లాలోకి ప్రవేశించాయి. తాజాగా భామిని మండలం పక్కుడు భద్ర వద్ద విద్యుతాఘాతంతో మూడో విడతగా వచ్చిన గుంపులో నాలుగు ఏనుగులు మృతి చెందాయి. మిగతా రెండు కాట్రగడ్డ సమీపంలో ఉన్నాయి.



ఏనుగు కళేబరం వద్ద జనాలు

ఆపరేషన్ గజ విఫలం



ఏనుగుల వల్ల గిరిజన పంటలకు, ఆస్తులకు, ప్రాణాలకు నష్టం జరుగుతుందని భావించిన గత పాలకులు, అధికారులు వాటిని తరలించే ప్రయత్నం చేశారు. 2007 అక్టోబర్‌లో ఏనుగుల గుంపును తరలించేందుకు అప్పటి ప్రభుత్వం ఆపరేషన్ గజ చేపట్టింది. చిత్తూరు, బెంగళూరుకు చెందిన తర్ఫీదు పొందిన మావటీలతో పాటు జయంతి, గణేష్ అనే శిక్షణ పొందిన ఏనుగులను రంగంలోకి దించారు. ఆశించినంతగా ఫలితం ఇవ్వలేదు. ఒడిశా నుంచి వచ్చిన ఏనుగులను ఒడిశా అడవులకు తరలించే ప్రయత్నాలు తరుచూ చేస్తున్నా అవి ఉమ్మడి జిల్లాను వదిలి వెళ్లడం లేదు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు (ఐటీఐ)ల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల సమన్వయకర్త కేఎస్ శ్రీనివాసరావు చెప్పారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఐటీఐ.ఏపీ.జీవోఐఎన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు అనంతరం ఎక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని, జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలు ఎచ్చెర్ల, శ్రీకాకుళం డీఎల్‌టీసీ, పలాసల్లో నిర్వహించే దరఖాస్తుల పరిశీలనకు హాజరు కావాలని అన్నారు. పరిశీలనకు హాజరు కాకుంటే కౌన్సెలింగ్‌కు అనర్హులవుతారని స్పష్టం చేశారు. జూన్ ఆరు వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని అన్నారు. మూడు ప్రభుత్వ ఐటీఐల్లో 640, 20 ప్రైవేట్ ఐటీఐల్లో 3036 సీట్లు ఉన్నాయని అన్నారు. ఐటీఐల్లో రెండేళ్ల ట్రేడులు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌మ్యాన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఏడాది ట్రేడులు డీజిల్ మెకానికల్, వెల్డర్, కటింగ్ అండ్ సీయింగ్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రొగ్రాం అసిస్టెంట్ ఉన్నాయని అన్నారు. జూన్ ఆరు సాయంత్రం ఐదు గంటలతో దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందని చెప్పారు. వివరాలు విద్యార్థుల ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్‌ల రూపంలో వస్తాయని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన అనంతరం కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తామని అన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలను సంప్రదించాలని సూచించారు.

జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం: పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, డయాలసిస్ యూనిట్‌లో 60 రకాల జాబ్‌లకు అవుట్ సోర్సింగ్ ద్వారా నియమకాలు జరుగుతాయని రిమ్స్ సూపరింటెండెంట్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఫైనల్ లిస్ట్ జాబితా జిల్లా వెబ్‌సైట్‌లో 12 నుంచి 15వ తేదీ వరకు ఉంటుందన్నారు. పై జాబితాల్లో అభ్యంతరాలు ఉంటే నేరుగా రిమ్స్ కార్యాలయంలో ఈ నెల 12వ నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

పని చేయకుంటే ఉపేక్షించేది లేదు

- వైద్యారోగ్య శాఖ సమీక్షలో కలెక్టర్ మండిపాటు

అరసవల్లి: 'మీరు ప్రభుత్వ సర్వీసులో ఉండాలంటే.. ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనిచేయాల్సిందే. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. మీ పనితీరు వల్లనే రాష్ట్రంలో వైద్యారోగ్య శాఖ ప్రగతిలో మన జిల్లా చివరి స్థానాల్లో ఉండాల్సి వచ్చింది.' అంటూ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా వైద్యారోగ్య శాఖ సమీక్షలో ఆయన పలువురు అధికారుల తీరుపై మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యారోగ్య విభాగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోన్న తరుణంలో జిల్లాలో ఇలాంటి పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితులకు కారణమైన కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు ఎవ్వరినీ ఉపేక్షించబోనని గట్టిగా చెప్పారు. పర్యవేక్షణ లోపం వల్లనే పరిస్థితులు దిగజారాయని కలెక్టర్ అన్నారు. పీహెచ్‌సీల పరిధిలో మెడికల్ ఆఫీసర్లు, వివిధ ప్రోగ్రాంల విషయంలో ఆయా ప్రోగ్రాం అధికారులు ఏమాత్రం పర్యవేక్షణ చేయకుండా కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు.



మెడికల్ ఆఫీసర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, పక్కనే డీఎంహెచ్ఓ మీనాక్షి

ఇక మీదట రాష్ట్రంలో ప్రగతి విషయంలో ముందు వరుసలో లేకపోతే ఆయా ప్రోగ్రాం అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పని చేయలేమనుకుంటే తక్షణమే ప్రభుత్వ సర్వీసులను వదిలేయాలని హెచ్చరించారు. తాజాగా ప్రగతి విషయంలో రాష్ట్రంలోనే ఏఎన్‌ఎం డిశ్చార్జ్ ఫీడ్‌బ్యాక్ రిపోర్ట్‌లో జిల్లా 24వ స్థానంలోనూ, ఎన్‌సీడీ-సీడీ సర్వేలో 17వ స్థానం, ఎన్‌సీడీ హైపర్‌టెన్షన్‌లో 23వ స్థానం, ఎన్‌సీడీ డయాబెటిస్‌లో 24వ స్థానం, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో 25వ స్థానం, యాంటీనాటల్ కేర్ పరీక్షల్లో 21వ స్థానం, తల్లీబిడ్డ ట్రాన్స్‌పోర్టు విషయంలో ఏకంగా 26వ స్థానంలో ఉన్నామన్నారు. ఇక కంటివెలుగు శస్త్ర చికిత్సలో, బర్త్ ప్లానింగ్ ప్రోగ్రాంలలో మాత్రం రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నామని ప్రకటించారు. జిల్లాలో ప్రతి రోజూ మెడికల్ ఆఫీసర్లతో డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని, అలాగే ప్రగతి రిపోర్టులు తయారు చేయడంలో కూడా శాఖ సిబ్బంది అధ్వానంగా ఉన్నారని, సరి చేసుకోవాలని సూచించారు. ఇప్పటికీ ఖాళీలుగా ఉన్న 55 ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

ఆ వైద్యులు ఆర్‌ఎంపీతో సమానం

సర్జికల్ కత్తి పట్టని వైద్యుడు తన దృష్టిలో ఆర్‌ఎంపీతో సమానమని, ఈ జనరేషన్‌లో కొందరు వైద్యుల తీరు ఎంతో ఆందోళన కలిగిస్తోందని డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. సర్వీసులోకి చేరి ఏళ్లు గడుస్తున్నా ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లకు కత్తి పట్టడానికి భయపడుతున్న వైద్యుల తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే చాలామంది వైద్యాధికారులు పీహెచ్‌సీ పరిసరాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ వేస్తున్నారని, ప్రభుత్వ వైద్య ఉద్యోగాల కోసం క్యూ కట్టుకుని ఉన్నారని, ఎవరికి ఇష్టం లేదో వాళ్లు గవర్నమెంట్ సర్వీసును వదిలిపెట్టివెళ్లిపోవాలని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. సమావేశంలో అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ అనూరాధ, డెప్యూటి డీఎంహెచ్ఓ లక్ష్మీతులసి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జంపు కృష్ణమోహన్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

లంచం అడిగి.. రెడ్‌హ్యాండెడ్‌గా దొరికి

- లంచం తీసుకుంటూ దొరికిపోయిన హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కన్నంనాయుడు
- ఇంటి బిల్లు ఫైనల్ చేయడానికి రూ.13వేలు డిమాండ్ చేసిన అధికారి
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- పక్కాగా ప్లాన్ చేసి పట్టుకున్న వైనం



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయిన వర్క్ ఇన్‌స్పెక్టర్ కన్నంనాయుడు

లావేరు: ఇంటి బిల్లు మంజూరు చేయడానికి లంచం అడిగిన అధికారి.. అవినీతి నిరోధక శాఖకు అడ్డంగా దొరికిపోయాడు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి బీవీఏస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వాళ్లేపేటకు చెందిన కిల్లారి కృష్ణ అనే వ్యక్తికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 2021లో రూ.2లక్షల యూనిట్ విలువతో ఇల్లు మంజూరైంది. మొదటి విడతగా రూ.19 వేలు బిల్లు మంజూరు కాగా అందులో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.కన్నంనాయుడు రూ.1900 లంచం అడగడంతో లబ్ధిదారుడు ఇచ్చారు. రెండో విడతగా రూ.1.36 లక్షలు బిల్లు మంజూరైంది. అయితే ఈ డబ్బు కావాలంటే తనకు రూ.13వేలు లంచం ఇవ్వాలని వర్క్ ఇన్‌స్పెక్టర్ డిమాండ్ చేశాడు. కానీ కృష్ణ డబ్బు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. లంచం ముట్టకపోవడంతో అధికారి బిల్లు ఫైనల్ చేయకుండా కృష్ణను ఇబ్బంది పెట్టాడు. ఎంతగా విన్నవించినా కరుణించలేదు. దీంతో కృష్ణ గత్యంతరం లేక అవినీతి నిరోధక శాఖ అధికారులను ఈ నెల 11న ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు కృష్ణకు రసాయనం పూసిన రూ.13వేలు ఇచ్చి ఆ డబ్బును లంచంగా ఇవ్వాలని సూచించారు. దీంతో లావేరులోని హౌసింగ్ కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు కృష్ణ రూ.13వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను అరెస్టు చేసి విశాఖలోని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. డీఎస్పీతో పాటు సీఐలు భాస్కర్, హరి, సిబ్బంది పాల్గొన్నారు.

లంచం ఇవ్వకపోతే



నాకు 2021 సంవత్సరంలో ఇల్లు మంజూరైంది. మొదటి విడతగా రూ.19వేలు బిల్ అయితే వర్క్ ఇన్‌స్పెక్టర్ కన్నంనాయుడుకు రూ.1900 లంచం ఇచ్చాను. రెండోసారి రూ.1.36 లక్షలు బిల్ అయింది. రూ.13వేలు లంచం అడిగాడు. నేను ఇవ్వలేదు. ఫైనల్ బిల్ పెట్టాలని చాలా సార్లు అడిగితే రూ.13వేలు ఇస్తేనే పెడతానని అన్నాడు. విసిగిపోయి ఏసీబీ అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశాను. – కిల్లారి కృష్ణ, ఇంటి లబ్ధిదారుడు, వాళ్లేపేట గ్రామం, లావేరు మండలం

వేసవి కృత్యాల పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: జీవశాస్త్రం వేసవి కృత్యాల పుస్తక ఆవిష్కరణ ఘనంగా జరిగింది. వేసవి సెలవుల్లో బాలబాలికలు తమ సమయాన్ని వినోదాత్మకంగా, విజ్ఞానాత్మకంగా గడపడం కోసం అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులు వారిని తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా వేసవి కృత్యాలను తయారుచేయాలని ఇటీవల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు వెలువరించారు. ఆ ఆదేశాల మేరకు శ్రీకాకుళం బయలాజికల్ సైన్స్ డాట్ టీచర్స్ బృందం 6, 7 తరగతులకు ఒక పుస్తకం, 8, 9, 10 తరగతులకు మరొక పుస్తకాన్ని వేరువేరుగా తయారుచేసి ముద్రించారు. ఈ పుస్తకాల ఈ తయారీలో హెచ్ఎంలు ఎన్.కుమారస్వామి, జి.ఉమామహేశ్వరి, మరికొంతమంది నిష్ణాతులైన బయోలజీ ఉపాధ్యాయులు కృషి చేశారు. ఈ కమిటీలో డీఈఓ ఎస్.తిరుమలచైతన్య, ఏపీసీ డాక్టర్ ఆర్.జయప్రకాష్, డీవైఈవో టిక్కలి గార పగడాలమ్మ, డీసీఈబీ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, హెచ్ఎంల సంఘం జిల్లా కార్యదర్శి పి.దాలినాయుడు, వాసుదేవరావు, తదితరులు సభ్యులుగా ఉన్నారు.

పుస్తకాలను ఆవిష్కరించిన డీఈఓ

ఈ పుస్తకాలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య ఆవిష్కరించారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈ ఆయన మాట్లాడుతు ఈ పుస్తకాలలో ఉండే కృత్యాలు.. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందదగిన విధంగా తయారుచేశారని ప్రశంశించారు. సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ మాట్లాడుతూ ఈ పుస్తకాలలో పొందుపర్చిన కృత్యాలు మిగిలిన సబ్జెక్టుల ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉంటుందని అభినందించారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ తిరుమల చైతన్య, హెచ్ఎంలు, టీచర్లు

జీసీ హోంలో సేవలపై ఆరా

నరసన్నపేట: స్థానిక పల్లిపేట రోడ్‌లోని జీసీ హోంను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ శుక్రవారం తనిఖీ చేసింది. కమిటీ అధ్యక్షురాలు యు.శ్రీలక్ష్మి జీసీ హోమ్‌లో విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వసతి సౌకర్యాలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ చైల్డ్ ప్రొటెక్షన్ సెంటర్ ఆదేశాలను అమలు చేయాలని సూచించారు. సమావేశం జీసీ హోం లోకల్ కమిటీ చైర్మన్ సదాశివుని కృష్ణ, వార్డెన్ రవీంద్రనాద్ సాహూ, కమిటీ సభ్యులు రమణమూర్తి, ఎం.గడ్డెన్న పాల్గొన్నారు.



ఆర్చరీ నేర్చుకుంటున్న చిన్నారులు

హాలిడేస్.. జాలీడేస్

బడులకు సెలవు కావడంతో పిల్లలు మైదానాల్లో కనిపిస్తున్నారు. వేసవి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఇలా పలు క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



ఫుట్ బాల్ నేర్చుకుంటున్న చిన్నారులు



బాస్కెట్ బాల్ శిక్షణలో..



క్రికెట్‌లో శిక్షణ పొందుతూ..

క్లుప్తంగా

సకాలంలో విద్యాకానుక కిట్ల పంపిణీ



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో పాఠశాలలకు చేర్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. టెక్కలి బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను శుక్రవారం పరిశీలించారు. పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బ్యాగులు, డిక్షనరీల సరఫరా విషయమై వివరాలు తెలుసుకున్నారు. టెక్కలి మండలంలో 89 పాఠశాలల్లోని 6050 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, యూనిఫామ్స్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఈఓ తిరుమలచైతన్య, సర్వ శిక్షా అభియాన్ ఏపీసీ ఆర్.జయప్రకాశ్, ఎంఈఓ నాగభూషణరావు, ఏపీఓ నారాయణరావు, ఏఈ గణేష్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నీలమణిదుర్గ ఉత్సవాలకు రూ.5లక్షలు మంజూరు



కమిటీ సభ్యులకు చెక్ అందజేస్తున్న డీటీలు

పాతపట్నం: పాతపట్నంలో ఈ నెల 21 నుంచి 30 వరకు నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవ నిర్వహణ కోసం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ రూ.5 లక్షలు మంజూరు చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీలు శైలజ, భీమారావులు ఉత్సవ కమిటీ సభ్యులు నూలు బుజ్జికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రామ గణపతి, ఆర్ఐ బాబీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ అధికారిగా రమణ



డీఎల్‌పీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న రమణ

టెక్కలి: టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారిగా ఐ.వి.రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదివరకు మందస మండలంలో ఈవోపీఆర్డీగా పని చేసి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. టెక్కలి డివిజన్ పరిధిలో సిబ్బంది సహకారంతో మంచినీరు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల నిర్వాహణతో పాటు పంచాయతీ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. ప్రధానంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం దిశగా పాలన అందజేస్తామన్నారు. అనంతరం డివిజన్ పరిధిలో పలువురు పంచాయతీ అధికారులు ఆయనను సత్కరించారు.

15 నుంచి డిగ్రీ స్పాట్ వాల్యుయేషన్

శ్రీకాకుళం న్యూకాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ డిగ్రీ మూడో సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ ఈ నెల 15 నుంచి మొదలుకానుందని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకన ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, హిస్టరీ, పాలిటిక్స్, ఎకనామిక్స్, కామర్స్, మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్ తదితర పేపర్లలో మూల్యాంకనం జరుగుతుందని తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	62,130-00
బంగారం(22కే. 10గ్రా.)	56,950-00
వెండి (కిలో)	82,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 490.00
విజయనగరం	రూ. 494.00
శ్రీకాకుళం	రూ. 494.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..!

- తొలి విడతగా జిల్లాకు 6,51,204 పుస్తకాలు రాక
- మండల కేంద్రాల్లో భద్రం
- పాఠశాల తెరిచే రోజే పుస్తకాలు పంపిణీ
- విద్యాకానుక కిట్లు సైతం సిద్ధం



నరసన్నపేటలో పాఠ్య పుస్తకాలను సరిచూస్తున్న ఎంఈఓ, సీఆర్‌పీ తదితరులు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ ఒకప్పుడు ప్రహసనంగా మారేది. తరగతులు ప్రారంభమైన నెలల తర్వాత పుస్తకాలు వచ్చేవి. అవి కూడా అరకొరగానే. ముఖ్యంగా టీడీపీ పాలనలో అర్థ సంవత్సర పరీక్షలు అవుతున్నా పుస్తకాలు అందేవి కావు. ఇప్పుడా పరిస్థితి లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గత నాలుగేళ్లుగా పాఠశాలలు తెరిచే నాటికే పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు చేరుతున్నాయి. వేసవి సెలవుల్లోనే పాఠ్య పుస్తకాలు మండల కేంద్రాలకు చేర్చి ఆయా స్కూల్స్‌కు పంపిణీ చేయడం సత్ఫలితాలనిస్తోంది. 2023/24 విద్యా సంవత్సరంలో పాఠశాల ప్రారంభం నాటికే జగనన్న విద్యా కానుక కిట్లతో పాటు పూర్తిస్థాయిలో పుస్తకాలు విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీంట్లో భాగంగా జిల్లాలోని 1,79, 033 మంది విద్యార్థులకు జూన్ 12న పుస్తకాలతో పాటు జగనన్న విద్యా కానుక కిట్లు అందించనున్నారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలానికో స్టోరేజీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి దాంట్లో విద్యా కానుక కిట్లు, పాఠ్య పుస్తకాలను నిల్వ చేస్తున్నారు. ఈ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది.

చురుగ్గా సరఫరా..

జిల్లాలో 1.79 లక్షల మంది విద్యార్థులకు గాను 21.29 లక్షల పుస్తకాలు మొదటి సెమిస్టర్‌కి అవసరం. అందులో 6.51 లక్షల పుస్తకాలను ఇప్పటికే మండల కేంద్రాలకు చేర్చారు. మిగిలిన పుస్తకాలు కూడా ముద్రణ అయ్యాయి. జిల్లా కేంద్రంలోని బుక్‌స్టోరుకు వచ్చిన వెంటనే మండల కేంద్రాలకు పంపుతున్నారు. మే నెలాఖరుకల్లా పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు, తద్వారా స్కూల్స్‌కు పంపించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సిద్ధమవుతున్న విద్యా కానుక కిట్లు..

మండల స్టోరేజీ పాయింట్లకు జగనన్న విద్యా కానుక కిట్లకు సంబంధించిన మెటీరియల్ ఒక్కొక్కటిగా చేరుతున్నాయి. ఈసారి అదనంగా స్టీల్ గ్లాసులు విద్యార్థులకు ఇవ్వనున్నారు.

ప్రారంభం రోజే పుస్తకాలు..



జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమయ్యే జూన్ 12 నాటికే విద్యార్థులకు పుస్తకాల అందించనున్నాం. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. జగనన్న విద్యా కానుక కిట్లు కూడా ఒకేసారి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

ప్రతి పౌరుడూ పోలీసే..



ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం. చిత్రంలో ఎమ్మెల్యే రెడ్డిశాంతి, పోలీసు అధికారులు

- శాంతిభద్రతలకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్
- కొత్తూరు నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని

కొత్తూరు: ప్రతి పౌరుడూ పోలీసేనని, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. కొత్తూరులో రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని స్పీకర్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని స్పీకర్‌తో కలిసి ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో 25 పోలీస్ స్టేషన్‌లను నిర్మించగా, ఒక్కో స్టేషన్‌కు రెండున్నర కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ఒడిశా ఆంధ్రా సరిహద్దు మండలాలైన కొత్తూరు, మందసలో నూతన భవనాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ నడుస్తోందన్నారు. ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. పేదిరకం నిర్మూలనే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఐజీ జి.హరికృష్ణ, ఎస్పీ జి.ఆర్.రాధిక, ఏఎస్పీ పి.విఠలేశ్వరరావు, టెక్కలి సబ్ డివిజన్ డీఎస్పీ బాలచంద్రా రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బాలరాజు, సీఐ ఆర్.వేణుగోపాలరావు, ఎస్ఐ ఎం.గోవిందరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు మెంబర్ సురాడ రాజేశ్వరి, ఈఈ తమ్మిరెడ్డి, డీఈఈ వెంకటరెడ్డి, కాంట్రాక్టర్ రఘురాం పండా, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, పీఏసీఎస్ చైర్మన్లు చింతాడ సూర్యనారాయణ, ఏవీ సురేష్, కె.కృష్ణ ఏఎంసీ చైర్మన్ అర్జునరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట నందకుమార్, మొజ్జాడ చక్రపాణి, బూర్లె శ్రీనివాసరావు, గండివలస ఆనందరావు, కామక త్రినాథరావు, లోతుగెడ్డ తిరుపతిరావు, వైస్ ఎంపీపీ ప్రతీప్, వనుము లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీడి మద్దతు ధరకు ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: ఉద్దాన ప్రాంతం ప్రధాన పంట జీడికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలం సొండిపూడిలో నూతనంగా నిర్మించిన సచివాలయం భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెక్రటరీ స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారులకు వరకు జీడి మద్దతు ధర కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ సమయంలోనే మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీకి జీడి మద్దతు ధర గుర్తుకు రావడం విచారకరమన్నారు. ఎన్నికల సమయంలో సమస్యలు శివాజీకి బాగానే గుర్తుకు వస్తాయని ఎద్దేవా చేశారు. 60 ఏళ్ల పాలనలో గౌతు కుటుంబం ఈ ప్రాంతానికి ఏం చేసిందని ప్రశ్నించారు. వారు ఆడే నాటకాలను ప్రజలు నమ్మవద్దన్నారు. ఉద్దానం ప్రాంతానికి ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని స్పష్టం చేశారు. శుద్ధజలం, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పథకాలు, రీసెర్చ్ సెంటర్, రైతుభరోసా, తిత్లీ నష్టపరిహారం పెంపుతో పాటు మౌలిక సదుపాయాలు కూడా కల్పించిందన్నారు. కాగా, మూలిపాడుకు చెందిన బొందల ధనుంజయ నామకరణం ఆధ్వర్యంలో పలు కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, సొండిపూడి, మూలిపాడు సర్పంచ్‌లు చిచ్చుల నళినీ, గుసిరి వెంకటరావు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, యువజన అధ్యక్షుడు దడ్డ కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ గౌరహరో మహంతి, జిల్లా కార్యదర్శి రాపాక శేషగిరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిచ్చుల శ్రీను, మల్లారెడ్డి జగన్, పోలం శ్రీను, జడ్డిడి భాస్కర్, తెలుకల గురుమూర్తి, సార దూర్వాసులు, దట్టి కోదండరావు, నగిరి ప్రవీణ్‌కుమార్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జూన్ 10 వరకు హెల్త్‌కార్డు గడువు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులు హెల్త్ కార్డు పొందేందుకు జూన్ 10 వరకు గడువు ఉందని జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. గ్రూప్ మెడిక్లెయిమ్, పర్సనల్ యాక్సిడెంట్ పాలసీలు 2023-24 సంవత్సరానికి న్యాయవాదులకు ఖరారు చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్, ప్రభుత్వ గ్రాంట్ కింద ప్రత్యేక కమిటీ 2023-24 సంవత్సరానికి న్యాయవాదులకు గ్రూప్ మెడీ-క్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద విధానాలు ఖరారు చేసిందని పేర్కొన్నారు. కుటుంబంలో న్యాయవాదితో పాటు మరో ముగ్గురు (భార్యాపిల్లలు/ఆధారపడి ఉన్న వారు)కు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. ప్రీమియంలో దాదాపు 1/3వ వంతు సంబంధిత బీమా చేసిన న్యాయవాది చెల్లించాలని, మిగిలిన మిగిలిన మొత్తాన్ని ఏపీ ప్రభుత్వ గ్రాంట్, బార్ కౌన్సిల్ నిధుల నుంచి చెల్లిస్తారని తెలిపారు. ప్రమాదవశాత్తు న్యాయవాది చనిపోతే (కుటుంబ సభ్యులకు వర్తించదు) రూ.10 లక్షల పరిహారం అందుతుందని చెప్పారు. 70 ఏళ్లలోపు లాయర్లు మాత్రమే పాలసీకి అర్హులని స్పష్టం చేశారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



మృతి చెందిన నర్సింహులు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న జీరు నర్సింహులు (67) అనే వృద్ధుణ్ని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పైడిభీమవరం పంచాయతీ చిల్లపేటకు చెందిన నర్సింహులు జాతీయ రహదారి పక్కన మేకలు మేపుతుండగా శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆపకుండా వెళ్లిపోయిన కారును స్థానికులు గమనించి జే.ఆర్.పురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జాతీయ రహదారిపై ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా జార్ఖండ్‌కు చెందిన కారుగా గుర్తించి నాతవలస టోల్ సమీపంలో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. నర్సింహులుకు వివాహితలైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

ఇచ్ఛాపురం రూరల్: జిల్లాలో ప్రీ ప్రైమరీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 10,516 మంది గర్భిణులు, 10,384 మంది బాలింతలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి అన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించిన ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆటపాటలతో కూడిన విద్యాబోధనకు అనువుగా రోజుల వ్యవధిలో కార్యకర్తలు, ఆయాల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నామని చెప్పారు. పౌష్టికాహారం, మౌలిక వసతుల కల్పనలో లోటుపాట్లు, అక్రమాలకు తావు లేకుండా ప్రత్యేక యాప్‌లు రూపొందించినట్లు తెలిపారు. శానిటేషన్ యాప్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రం, పరిసరాల పరిశుభ్రత వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయిస్తున్నామని, పారిశుద్ధ్యం లోపిస్తే వెంటనే యాప్‌లో వివరాలు నమోదు చేస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శికి సమాచారం వెళుతుందన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు కోడిగుడ్లు, పాలు, బాలామృతం, అటుకులు, రాగిపిండి, జొన్నపిండి, కర్జూరం, బెల్లం, చిక్కీలతో కూడిన కిట్లు సరఫరా చేస్తున్నామని వివరించారు. చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సమావేశంలో సీడీపీఓ పురాణం నాగరాణి, ఏసీడీపీఓ వై.లావణ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



1990 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో 1990 బ్యాచ్‌కు చెందిన వంద మంది బాల్య మిత్రులు శుక్రవారం ఒకేవేదికపైకి చేరారు. ఆనందాలు, ఆత్మీయ పలకరింపులతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఐ.వెంటకరావు, కేశవరావు, మోహనరావు, పి.జయలక్ష్మీలను ఘనంగా సత్కరించారు. తమ ఉన్నతికి గుర్తుగా అదే పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.10వేలు, రూ.7,500, రూ.5000 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఇకపై టెన్త్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రతి ఏడాది స్కాలర్‌షిప్‌గా తమ బ్యాచ్ తరపున రూ.22,500 అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాళ్ల సత్యం, సాడి కామేశ్వరరావురెడ్డి, అనపాన తమ్మయ్య, దట్టి శ్రీను, కాళ్ల శ్రీను, కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గకు మామిడిపండ్ల అలంకరణ



శ్రీకాకుళం నగరంలోని ఇన్‌కంటాక్స్ కార్యాలయం దరి నానుబాలవీధిలో విజయదుర్గ అమ్మవారికి వైశాఖ మాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర చూత ఫలములు(మామిడిపండ్లు)తో ప్రత్యేక అలంకరణ చేశారు. సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. – శ్రీకాకుళం అర్బన్

దివ్యాంగుల వసతి గృహంలో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో చలన సంబంధ, బధిర, అంధ, విభిన్న ప్రతిభావంతులైన బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ ఏడీ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో వసతి గృహం ఉందని, ఇందులో ప్రవేశానికి 2023-24 విద్యా సంవత్సరంలో 1 నుంచి 10వ తరగతి, ఇంటర్, ఆపై తరగతులు చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఉచిత భోజన, వసతి, నోట్ పుస్తకాలు, యూనిఫాం, కాస్మొటిక్ చార్జీలు తదితర సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.

ఏడీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు 08942-240519, 8074777210, 9951971764 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

14న హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న జరగనున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని సంఘ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వీహెచ్‌పీ కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై జీటీ రోడ్డు మీదుగా వివేకానంద జంక్షన్ మహిళా కళాశాల, అరసవిల్లి జంక్షన్, పాతబస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌కు మరలా శోభాయాత్ర చేరుకుంటుందని వివరించారు. స్వామీజీలు, కోలాట బృందాలు, భజన బృందాలు, హనుమాన్ చాలీసా పారాయణ, సాంస్కృతిక నాట్యాలతో శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ సాలక్ పారనంది వెంకటరమణ మూర్తి, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు లోకనాథం ఆనంద్, కోశాధికారి ధర్మవరపు ఆచారి, అయ్యప్ప సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు, హోటల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్, భక్తి స్వరాంజలి గ్రూప్ గౌరవ అధ్యక్షులు బస్వా శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ జామ్ శ్రీను గురుస్వామి, జిల్లా సహ మఠమందిర్ ప్రముఖ్ మెట్ట ధనుంజయ, సాప్తహిక్ మిలన్ ప్రముఖ్ ఆశి ఉమామహేశ్వర రెడ్డి, సురక్ష ప్రముఖ కొయ్యాన కిరణకుమార్, భలోపాసనా ప్రముఖ బరాటం సంతోష్, గార మండలం కార్యదర్శి ఆనంద్ కాశ్యప్, ఎస్ఎస్ఎఫ్ సబ్ డివిజన్ కన్వీనర్ లోద్దు కృష్ణారాజు, బగ్గు తరుణ్, బజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: గార మండల పరిధిలోని కొత్తూరు సైరిగాంలో మునసలమ్మ కోనేరులో జరుగుతున్న ఉపాధి పనులను జెడ్పీ సీఈవో వెంకటరామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, పీడీ చిట్టిరాజులు శుక్రవారం పరిశీలించారు. క్షేత్ర సహాయకులు, మేట్లు, వేతనదారులతో మాట్లాడారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందని చెప్పారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులు ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీడీ శైలజ, ఎంపీడీఓ రామ్మోహన్‌రావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తిరుమలరావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల సప్లిమెంటరీ ఫలితాల వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్)కు చెందిన 1, 3, 5 సెమిస్టర్ల సప్లిమెంటరీ ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు శుక్రవారం విడుదల చేశారు. ఒకటో సెమిస్టర్‌లో బీఏ 66.67 శాతం, బీకాం 69.39 శాతం, బీకాం కంప్యూటర్స్ 88.68, బీఎస్సీ 61.59 ఉత్తీర్ణతతో విద్యార్థులు పాసైనట్టు చెప్పారు. మూడో సెమిస్టర్‌లో బీఏ 60 శాతం, బీకాం 66.67, బీకాం కంప్యూటర్స్ 89.13, బీఎస్సీలో 81.03 శాతం ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.